క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



పాన్‌గల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయ ఆలయానికి మండల కేంద్రంలోని వెంకటేశ్వర రైస్ మిల్ యజమాని వెంకటేశ్వర్‌రెడ్డి రూ.లక్ష, కర్నాల బాలస్వామిరెడ్డి రూ. 50 వేలు ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి తమ వంతుగా ఆర్థిక సహాయం చేసి దాతలకు ఆలయ కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాముయాదవ్, కమిటీ సభ్యులు రమేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి ఆలయానికి..



పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని తాటిపాములకు చెందిన కీ.శే.మొగులమ్మ, చంద్రయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు ఆడెం యాదయ్యయాదవ్, సర్పంచ్ ఆడెం సత్యంయాదవ్ చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయానికి రూ.50,116 తోటవీరక్షత్రీయ సంఘం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పార్వతమ్మ, ఉప సర్పంచ్ కురుమన్న, ఆంజనేయులు, రాజు, రామచంద్రయ్య, రామదాసు తదితరులు పాల్గొన్నారు

రైతులు ఆర్థికంగా బలపడాలి



ఖిల్లాఘనపురం: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా అందిస్తున్న దీర్ఘకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల సింగిల్‌విండో అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కార్యాలయం వద్ద ఆరుగురు రైతులకు ఉపాధ్యక్షుడు క్యామ రాజుతో కలిసి రూ.38.40 లక్షల దీర్ఘకాలిక రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల పెంపకం కోసం రైతులకు రుణాలను ఇచ్చామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కృష్ణయ్య గౌడ్, సీఈఓ ప్రకాష్, సిబ్బంది పలువురు రైతులు పాల్గొన్నారు.

గౌడల అభ్యున్నతికి కృషి



వీపనగండ్ల: గౌడల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని గౌడలు సద్వినియోగించుకునే విధంగా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఎస్ఐ రామన్‌గౌడ్, రాష్ట్ర గౌడ సంఘం నాయకులు రాంచంద్రయ్య గౌడ్, మండల వ్యవసాయాధికారి దాకేశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గౌడ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణలో వారు పాల్గొన్నారు. కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని, సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు గౌడలు ముందుండాలని వారు గౌడ సంఘం సభ్యులను కోరారు. కార్యక్రమంలో మోహన్‌గౌడ్, వెంకన్‌గౌడ్, శశిధర్‌గౌడ్, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు



ఆత్మకూర్: వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లను అమ్మినా, వాడిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బీఎస్‌కే రమేష్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లో దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా నలుగురు వ్యాపారస్తులకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని పలుమార్లు అవగాహన కల్పించి హెచ్చరించినా వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లను యథేచ్ఛగా వాడుతుండడం విచారకరమన్నారు.

పరామర్శ

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన కాంగ్రెస్ నాయకుడు వినోద్ కుటుంబాన్ని బుధవారం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



‘కంటివెలుగు’ను జయప్రదం చేద్దాం



వీపనగండ్లలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి శ్రీనివాసులు

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమంలో పాల్గొనే ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో 4.80లక్షల మందికి కంటి పరీక్షలు అవసరమవుతాయని గుర్తించామని అన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 28 బృందాలతో కంటి పరీక్ష శిబిరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి రోజు ఒక్కో శిబిరంలో 300 మందికి పరీక్షలు నిర్వహిస్తామని, అవసరమైన వారికి వెంటనే కంటి అద్దాలను పంపిణీ చేస్తామన్నారు. ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలంలో 46వేల మందికి కంటి పరీక్షలు నిర్వహిస్తామని అందుకు ఉమ్మడి మండలాల్లోని ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వంశీకృష్ణ, అదనపు వైద్యులు రాజశేఖర్, హేమవర్ధన్, అసిస్టెంట్ రాములు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొండల్‌రావు కోరారు. బుధవారం మండలంలోని వెనికితండా, కోతులకుంటతండాల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను ఎంపీడీఓ విజయ్‌కుమార్, మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ రాజు తదితరులతో కలిసి పరిశీలించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో కార్యక్రమం నిర్వహించే ప్రాంతం, మరుగుదొడ్లు, కుర్చీలు, విద్యుత్ సదుపాయం కల్పించాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచు రాజునాయక్, హెచ్ఈఓ నర్సింహులు సిబ్బంది విమల, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కంటివెలుగు మానిటరింగ్ అధికారి విజయ్‌కుమార్, డాక్టర్ రంజిత్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ రమేష్ అన్నారు. బుధవారం ఒకటో వార్డు ఖానాపూర్‌లో ఇంటింటికీ వెళ్లి కంటివెలుగు కార్యక్రమం గురించి అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. గురువారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చెన్నయ్య, హెల్త్‌సూపర్‌వైజర్లు సామ్రాజ్యలక్ష్మి, సురేందర్‌గౌడ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

గోపాల్‌పేట: స్థానిక పీహెచ్‌సీ, తాడిపర్తి కంటివెలుగు కేంద్రాలను బుధవారం కంటివెలుగు ప్రోగ్రాం స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ తుకారాం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటివెలుగు ప్రోగ్రాంలో అధికారులు అలసత్వం వహించకుండా ప్రజలకు సేవ అందించాలని సూచించారు.

పాన్‌గల్: అన్నారంలో ఏర్పాటు చేసే కంటి వెలుగు కేంద్రంలో ఏర్పాట్లను మండల ప్రత్యేకాధికారి సురేష్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి, ఎంపీఓ రఘురాములు, సర్పంచ్ రాములు, కంటి వెలుగు వైద్యాధికారి నిహారిక, అప్తమాలిజిస్ట్ అబ్దుల్ తాకీర్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు రెండో విడత కార్యక్రమం గురువారం మండలంలోని వీరాయిపల్లి, వెల్టూర్ గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ అఫ్జల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



గోపాల్‌పేటలో..



వెనికితండాలో..



వీరాయిపల్లిలో..

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



కొత్తకోట రూరల్ (పెద్దమందడి): రైతులు పంటలను రక్షించుకునేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని మండల ఇన్‌చార్జీ వ్యవసాయ అధికారి కుర్మయ్య అన్నారు. బుధవారం మండలంలోని మంగంపల్లి, అల్వాల శివారులో వరి పొలాలను రైతులతో కలిసి ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చలి వాతావరణ పరిస్థితుల ప్రభావం వలన వరి నారుమళ్లు, నాటువేసిన వరి పంటలు ఎదగలేక పోతున్నాయని, ఆకుల కొనలు ఎరుపు, పసుపు రంగులో మారడం గమనించామని పేర్కొన్నారు. దీని నివారణకు పొలంలో నీటిని నిల్వ ఉంచకుండా చూడాలన్నారు. సూక్ష్మ పోషకాల మిశ్రమం 500గ్రాములు, 19-19-19 500గ్రాములు, చిలామిన్ జింక్ 200లీటర్ల నీటిలో కలిపి 10రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. వరి నాటిన 15రోజుల నుంచి 20రోజల వ్యవధిలో కలుపు తీసి ఎకరాకు 30నుంచి 40కిలోల యూరియాతో పాటు కార్టప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 8 నుంచి 10కిలోలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ జయప్రకాష్, రైతులు లక్ష్మీకాంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: మండలంలోని ప్రతి కూలీ జాబుకార్డుకు ఆధార్‌కార్డును అనుసంధానం త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 28 పంచాయతీల్లో 15 వేల జాబుకార్డులు ఉన్నాయని, వాటిలో ఇప్పటికి కేవలం 50 శాతం మాత్రమే ఆధార్ అనుసంధానం పూర్తి చేశారని.. మిగిలిన 50 శాతంను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) విధానాన్ని తప్పక అమలు చేయాలని ఆదేశించారు. దీంతో పాటు సామాజిక తనిఖీల్లో గ్రామాల వారీగా చెల్లించాల్సిన రికవరీ నగదుపై ఆరా తీశారు. నర్సరీల నిర్వహణ, హరితహారంలో మొక్కలకు వాటరింగ్, పారిశుద్ధ్యంపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఏపీఓ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



రాజవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

వనపర్తి టౌన్: ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 28 ఏళ్లుగా ఉద్యమం చేస్తున్నామని, అందుకు బీజేపీ అనుకూలంగా మేనిఫెస్టోలో పెడుతూ వస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజేష్ అన్నారు. కానీ చట్టబద్ధత కల్పించడంలో బీజేపీ తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు బీజేపీ అనుకూలంగా ఉన్నప్పటికీ కేంద్రంలో 8ఏళ్లు అధికారంలో ఉన్నా అడుగు ముందుకు పడట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగాల్లో తీవ్రంగా నష్టపోయారని, ఇక ఆలస్యం వహించకుండా రాష్ట్ర నాయకులందరితో పార్లమెంట్ ద్వారా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నరసింహ, నాగరాజు, చెన్నయ్య, గట్టు పాల్గొన్నారు.

పందుల తరలింపు ఎన్నడో?

అమరచింత: పట్టణంలో పందుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నా సంబంధిత మున్సిపాలిటీ పాలకవర్గం వాటిని పట్టణ శివారుకు తరలించేందుకు ముందుకు రాకపోవడం వింతగా ఉందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పందులు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో విష జ్వరాలు వ్యాపిస్తున్నాయని మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోక పోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల కిందట మున్సిపల్ కమిషనర్ పందుల తరలింపునకు పందుల పెంపకందారులు సహకరించకపోవడంతో వాటిని మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టుకొని ఇతర ప్రాంతాలకు అమ్మడానికి శ్రీకారం చుట్టారు. కానీ అప్పుడు అడ్డుకున్న పెంపకందారులు ప్రస్తుతం పందుల తరలింపు వ్యవహారంలో మీనమేషాలు వేస్తున్నారని పట్టణ ప్రజలు వాపోయారు. పందులతో మెదడువాపు వ్యాధి సోకుతుందని, అవి ఇళ్లలోకి చొరబడి పరిసరాలు అపరిశుభ్రంగా మారుస్తున్నాయని ఎన్నో పర్యాయాలు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలక మండలి సభ్యులు స్పందించి పందులను పట్టణ శివారుకు తరలించే కార్యక్రమంను చేపట్టాలని కోరుతున్నారు.

బస్‌పాసుల పంపిణీ

పెద్దకొత్తపల్లి: వెన్నచర్లలో అర్హులైన దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లను ఆర్టీసీ సిబ్బంది సుదర్శన్‌రావు బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన వారంతా దరకాస్తు చేసుకుంటే పాస్‌లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధ, ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, లక్ష్మీ, రాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కొల్లాపూర్: మండలంలోని ఎన్మన్‌బెట్ల చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగదీశ్వర్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా ఉందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాముయాదవ్, పరశురామ్‌నాయుడు, తిరుపతయ్య, శివ, రాముడు, కార్తీక్ తదితరులున్నారు.

లింగారెడ్డి విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు

అమరచింత: మండలంలోని ఈర్లదిన్నెలో గురువారం జరిగే స్వర్గీయ చుక్క లింగారెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతున్నట్లు రైతు సమితి మండల అధ్యక్షుడు చుక్క ఆశిరెడ్డి తెలిపారు. పీజేపీ నిర్వాసితుల కోసం ఎన్నో ఏళ్లుగా ప్రజల పక్షాన నుంటూ పోరాడి ఈప్రాంత ప్రజల హృదయాల్లో నిలిచిన లింగారెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. అదే విధంగా ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా లింగారెడ్డి రచించిన చుక్కవారి, మొరెడ్డి వారి వంశ వృక్షం అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నామన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభ

కోడేరు: మండల కేంద్రంలో బుధవారం పంచాయతీ వద్ద సర్పంచ్ వెంకటస్వామి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో డ్రెయినేజీలు, సీసీరోడ్లు, వీధిలైట్లు తదితర సమస్యలపై మాట్లాడి తీర్మానం చేసినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అనంతరం ప్రతి మంగళవారం నిర్వహించే సంత కోసం వేలంపాట నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఎంపీడీఓ ప్రభాకర్, కార్యదర్శి రవితేజ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు మరువలేనివి



గోపాల్‌పేటలో విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

అమరచింత: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సేవలు మరువలేమని టీడీపీ నాయకులు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని సందర్భంగా బుధవారం బస్టాండ్ కూడలిలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు సీతమ్మ, కొత్తకోట దయాకర్‌రెడ్డి ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మోడీ మనోహర్ రాజు, తిరుమలేష్, అబ్రహం, కౌన్సిలర్ లావణ్య, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం

వనపర్తి టౌన్: తారక రామారావు వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని సోనూసూద్ వృద్ధాశ్రమంలో టీడీపీ నాయకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నందిమల్ల, నందిమల్ల అశోక్, దస్తగిరి, గౌస్, బాలరాజు, శంకర్, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుధవారం ఎన్టీఆర్ 27వ వర్ధంతి వేడుకలను ఆపార్టీ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో రాములు, వెంకటయ్య, శాంతన్న పాల్గొన్నారు.

కొత్తకోట: స్థానిక చౌరస్తాలో బుధవారం టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, ఎండీ గఫార్, జనార్దన్ సాగర్, ప్రేమదానం, భాస్కర్, అభిమన్యుడు, గోకరయ్య, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూర్: పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కట్టెలమండి రాములు, కొత్తూర్ వెంకటేష్, గాలిపంపు శ్రీను, తిరుపతయ్యగౌడ్, మేస్త్రీ వెంకటన్న, కుమార్, చిన్న నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: కల్వరాల ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బిచ్చిరెడ్డి, వెంకటేశ్, కృష్ణయ్య, సత్యం, లక్ష్మయ్య, ఆటో రాంచంద్రయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంచారు. కార్యక్రమంలో బాలస్వామి, యాదయ్య, శ్రీనువాసులు, తిరుపతి, రాజశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామన్‌గౌడ్, రాజశేఖర్, గోల్డ్ బాలస్వామి, మాధవరెడ్డి, అఖిల్ పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం



చెక్కులను అందజేస్తున్న గాయత్రి, విజయభాస్కర్‌రెడ్డి

ఆత్మకూర్: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయిన చెక్కులను బాధిత కుటుంబాలకు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ అందజేశారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆత్మకూర్‌కు చెందిన ఇద్దరికి, పిన్నంచర్ల, మోట్లంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరికి చెక్కులను అందించారు. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న వీరు మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని సంప్రదించడంతో సీఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేయించారని వారన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌అలీ, లబ్ధిదారులు ఉన్నారు.

పీహెచ్‌సీలో నీటి కటకట

- 20 రోజులుగా మరమ్మతుకు నోచుకోని బోరు మోటారు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో రోగులు



మరమ్మతుకు నోచుకొని బోరు మోటారు

పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి నీటి సరఫరా అయ్యే బోరు మోటార్ మరమ్మతుకు నోచుకోక పీహెచ్‌సీలో 20 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో పీహెచ్‌సీకి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీహెచ్‌సీకి ప్రతి నిత్యం వివిధ గ్రామాల నుంచి ఎంతో మంది రోగులు, గర్భిణులు కాన్పుల కోసం వస్తుంటారు. పీహెచ్‌సీలో నీరు లేకపోవడంతో ఇక్కడికి వచ్చే రోగులు మరుగుదొడ్లను వినియోగించుకునే వీలు లేక అరుబయటికి వెళ్లాల్సిన పరిస్థితి దాపరించింది. నీటి సరఫరాను పునరుద్ధరించడంలో జాప్యం మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యం వైఖరికి నిదర్శనంగా కనిపిస్తుందని రోగులు వాపోతున్నారు. దీంతో పాటు పీహెచ్‌సీకి సరఫరా కావాల్సిన మిషన్ భగీరథ నీరు కూడా రాకపోవడం, మరో పక్క బోరు మోటారు మరమ్మతుకు నోచుకోకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరుమోటారు మరమ్మతు చేయించి పీహెచ్‌సీకి నీటి సరఫరా అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

ఆరుబయటికి వెళ్తున్నాం

నా కూతురు నాగమణి కాన్పు కోసం పీహెచ్‌సీకి వచ్చాం. ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. పీహెచ్‌సీలో నీటి సరఫరా నిలిచిపోవడంతో బాత్‌రూంకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంది. చేసేదేం లేక ఆరుబయటికి వెళ్లాల్సి వస్తుంది.

– కుర్వమ్మ, మాధరావుపల్లి

నిధులు లేక..

పీహెచ్‌సీలోని బోరు మోటార్ మరమ్మతుతో నీటి ఇబ్బంది ఉన్న మాట వాస్తవమే. మరమ్మతు చేయించేందుకు పీహెచ్‌సీకి సంబంధించిన ఎలాంటి నిధులు లేకపోవడంతో మరమ్మతులో జాప్యం జరుగుతుంది. ప్రస్తుతం రోగులకు ఇబ్బందులు కలగకుండా ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేయిస్తున్నామన్నారు. ఒకటి, రెండు రోజుల్లో బోరు మోటార్‌ను మరమ్మతు చేయించి నీటి ఇబ్బందులను తొలగిస్తాం.

– రాకేష్‌రెడ్డి, డాక్టర్, పాన్‌గల్ పీహెచ్‌సీ

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

కొల్లాపూర్: ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని టీఎన్జీఓ సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. కొత్తగా ఎన్నికైన కమిటీ నాయకులకు ఎమ్మెల్యే అభినందలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషిచేయాలని ఆయన నాయకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షుడు సత్యనారాయణ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్, ప్రేమ్‌చంద్, సత్యనారాయణ, రాజుయాదవ్, నర్మద పాల్గొన్నారు.